


PRGI NO:TGTEL/26/A6501

# జ్యోతి ప్రభంజనం

తెలుగు దిన పత్రిక

సంపుటి :01 సంచిక: 43 ఎడిటర్: రాపోలు లింగస్వామి 13 -10-2026 మంగళవారం

Printed/:Rangareddy , Published By: Hyderabad , Nalgonda, Rangareddy, Mahaboobabad, Medak,worangal,Nizamabad, Adilabad,Karimnagar,Kammam, పేజీలు:4 వెల: 2-00

## ఎన్నికల్లో ఓటమి భయంతోనే 'సర్' ను అమలు చేస్తోంది.

ఢిల్లీ, ప్రధానమంత్రి నరేంద్రమోదీ సర్కారుపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పశ్చిమ బెంగాల్, బిహార్, మహారాష్ట్రలో సర్ (ఓటర్ల ప్రత్యేక సమగ్రసవరణ)ఎక్కడ తీసేశారో అక్కడ బీజే పీగెలుస్తోందని ధ్వజమెత్తారు. మతాలు, ప్రాంతాల మధ్య బీజేపీ చిచ్చు పెడుతోందని దు య్యబట్టారు. మనుగడ లేని రాష్ట్రాల్లో ఇతర పార్టీలు గెలుస్తున్నాయని వెల్లడించా రు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై ఎందుకు చర్యలు తీసుకోవట్లేదని ప్రశ్నించారు.సీఈసీ ఎంపిక లో సుప్రీంకోర్టులో ప్రధాన న్యాయమూర్తిని తొలగించారని ప్రస్తావించారు.సోమవారం ఇండియా కూటమి ఆధ్వర్యంలో ఢిల్లీలో జరుగుతున్న ధర్నాలో సీఎం రేవంత్‌రెడ్డి, తెలంగాణ మంత్రులు, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడారు.




**జనాభా పెరుగుతుంటే ఓట్లు ఎలా తగ్గుతున్నాయి..?**

2014లో 81 కోట్ల ఓట్లు వచ్చాయని.. 2019లో 91 కోట్ల ఓట్లు, 2023లో 97 కోట్ల ఓట్లు ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. ఇప్పటికే 13 కోట్ల ఓట్లు తొలగించారని, ఇప్పుడు ఉన్న జనాభా ఎంత అని ప్రశ్నించారు. జనాభా పెరుగుతుంటే ఓట్లు ఎలా తగ్గుతున్నాయి..? అని నిలదీశారు. ఈ విషయంలో ఎవరు సమాధానం చెబుతారని అడిగారు. రాష్ట్రపతి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎవరు కూడా మోదీకి ఈ విషయం గురించి ఎందుకు చెప్పట్లేదని ప్రశ్నల వర్షం కురిపించారు. బీజేపీ రెండు వర్గాలను తయారు చేస్తోందని.. అనుకూలం ఉన్న వారికి ఓట్లు, ఇతరులను ఓట్లులేని వారిగా తయారు చేస్తోందని ధ్వజమెత్తారు. దేశంలోని పౌరులను మోదీ సర్కార్ రెండు రకాలుగా విడగొడుతోందని మండిపడ్డారు. ఓటు హక్కు కోల్పోతే ప్రభుత్వ సంక్షేమ పథకాలు పోతాయని ఆందోళన వ్యక్తం చేశారు.

**దేశంలో శాశ్వత విభజనను బీజేపీ తీసుకొస్తోంది..**

దేశంలో శాశ్వత విభజనను బీజేపీ తీసుకొస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి దుయ్యబట్టారు. సీఈసీపై మరో స్వతంత్ర పోరాటం జరుగుతోందని వెల్లడించారు. జ్ఞానేశ్ గో బ్యాక్ పేరుతో తమ ఆందోళన కొనసాగుతోందని చెప్పారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సర్ వ్యతిరేక పోరాటం, మరో స్వతంత్ర పోరాటమేనని.. సైమన్ గో బ్యాక్ పోరాటం లాగే తాము పోరాటం చేస్తామని అన్నారు. ఇన్నాళ్లు సీబీఐ, ఈడీ, ఐటీ వంటి సంస్థలను ఉపయోగించి ప్రత్యర్థులను అణిచివేశారని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ గెలవదనే అభిప్రాయంతో 'సర్'ను అమలు చేస్తున్నారని దుయ్యబట్టారు. తమకు ఓటు వేయని వారి ఓట్లను 'సర్' పేరుతో తొలగిస్తున్నారని ఆగ్రహించారు.

**ఏఐను ఉపయోగించి బీజేపీ వ్యతిరేక ఓట్లు తొలగిస్తున్నారు..**

ఏఐను ఉపయోగించి బీజేపీ వ్యతిరేక ఓట్లు తొలగిస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. మోదీకి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్న యువత ఓట్లను కూడా తొలగిస్తున్నారని ఫైర్ అయ్యారు. మోదీ ఎందుకు జ్ఞానేశ్ కుమార్‌ను కాపాడుతున్నారని ప్రశ్నల వర్షం కురిపించారు. ఓట్లను తొలగించి పశ్చిమబెంగాల్, బిహార్, హరియానాలో గెలిచారని ధ్వజమెత్తారు. ఓటు లేకపోతే ఏ పార్టీ పేదలను పట్టించుకోదని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## ఆర్టీసీ-మెట్రో కామన్ పాస్ ధరలపై ప్రభుత్వం పునఃసమీక్ష




హైదరాబాద్, అక్టోబర్ 12: ఆర్టీసీ-మెట్రో కామన్ పాస్ ఛార్జీలపై పునఃపరిశీలన చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కామన్ పాస్ ధరలు అధికంగా ఉన్నాయంటూ ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ఛార్జీలపై సమీక్ష జరిపేందుకు సర్కార్ నిర్ణయించినట్లు తెలిపారు. దీనిపై త్వరలో ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు.ప్రస్తుతం రోజువారీ కామన్ పాస్ ధర రూ.400 కాగా.. నెలవారీ కామన్ పాస్ ధర రూ.8,500గా నిర్ణయించామని మంత్రి తెలిపారు. అయితే సామాన్యులకు అందుబాటులో ఉండేలా ఛార్జీలపై పునఃసమీక్ష చేయనున్నట్లు వెల్లడించారు. ప్రయాణికుల అభిప్రాయాలు, వాస్తవ పరిస్థితుల ఆధారంగా నిర్ణయం తీసుకుంటామన్నారు. ప్రజలపై అదనపు ఛార్జీల భారం మోపడం ప్రభుత్వ లక్ష్యం కాదని స్పష్టం చేశారు. ఆర్టీసీ-మెట్రో సేవలను మరింత విస్తృతంగా వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలోనే కామన్ పాస్ ధరలపై తుది నిర్ణయం ఉంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

## సింగూరు ప్రాజెక్ట్‌పై కాంగ్రెస్ యాక్షన్ ప్లాన్ ఏంటి

హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. రైతు కూలీలకు డబ్బులు ఇవ్వడానికి కాంగ్రెస్‌కు మనసు లేదని మండిపడ్డారు. పంటలు వేయొద్దంటే రైతుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. రైతు కూలీలు ఎలా బతకాలి.. వలసలు పోవాలా అని నిలదీశారు. బీఆర్ఎస్ ఉన్నప్పుడు వలసలు వాపస్ వచ్చాయని.. ఇప్పుడు మళ్లీ వలసలు మొదలయ్యాయని విమర్శించారు.రైతులు డీజిల్ ఇంజిన్‌లు పెట్టుకుని పంటలను కాపాడుకుంటున్నారని.. ప్రతి దానికీ ఎల్‌నినోతో లింక్ పెడుతున్నారని మాజీ మంత్రి మండిపడ్డారు. బొగ్గు లేదంటే కూడా ఎల్‌నినో అంటున్నారన్నారు. సర్కార్ నిర్లక్ష్యం వల్లే రాష్ట్రానికి ఈ పరిస్థితి వచ్చిందని విరుచుకుపడ్డారు. దేవాదులలో మోటార్లు ఎందుకు నడపడం లేదని ప్రశ్నించారు. సింగూరు ప్రాజెక్ట్‌లో వాడుకునేందుకు రెండు టీఎంసీల నీరు మాత్రమే ఉందని తెలిపారు. ఆ నీళ్లను కూడా బీర్ల కంపెనీలకు ఇస్తున్నారని ఆరోపించారు. దసరా లిక్కర్‌కు షార్టేజ్ రావొద్దని వాళ్లకు నీళ్లు ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదేనా కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యమని ప్రశ్నించారు. సింగూరుపై కాంగ్రెస్ యాక్షన్ ప్లాన్ ఏంటని ప్రశ్నించారు.పంటల కోసం జూరాల గేట్లు తెరిస్తే రైతులను జైలుకు పంపారని.. తాగునీరు ఇవ్వకుండా బీర్ల కంపెనీలకు నీళ్లు ఇస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై కూడా కేసులు పెట్టాలని హరీశ్ డిమాండ్ చేశారు. నీళ్లుండి కూడా ఎత్తని ప్రభుత్వం ఇది అంటూ మండిపడ్డారు. రైతులతో గంట సేపు మాట్లాడే సమయం ముఖ్యమంత్రికి లేదా అంటూ ప్రశ్నించారు. బీర్ల కంపెనీలకు నీళ్లు, ఢిల్లీలో రాజకీయాలు తప్ప ఈ ప్రభుత్వానికి ఇంకో పని లేదని హరీశ్ రావు విమర్శించారు.



## దుర్గామాత మాల ధారణతో విద్యార్థులకు స్పెషల్ క్లాసులు నిరాకరణ!

**చంపాపేట్ సైనిక్ స్కూల్ యాజమాన్యంపై తల్లిదండ్రుల ఆగ్రహం**




చంపాపేట్, జ్యోతి ప్రభంజనం, అక్టోబర్ 12: దుర్గామాత మాల ధరించారనే కారణంతో పదో తరగతి విద్యార్థులను స్పెషల్ క్లాసులకు అనుమతించలేదంటూ చంపాపేట్ మారుతి నగర్‌లోని సైనిక్ స్కూల్ యాజమాన్యంపై తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులు మాల తొలగిస్తేనే తరగతులకు అనుమతిస్తామని యాజమాన్యం చెప్పినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.వివరాల్లోకి వెళితే దేవి శరన్నవరాత్రుల సందర్భంగా పలువురు పదో తరగతి విద్యార్థులు దుర్గామాత మాల ధరించారు. నిత్యం నిర్వహించే స్పెషల్ క్లాసులకు హాజరయ్యేందుకు పాఠశాలకు వచ్చిన విద్యార్థులను మాల తొలగిస్తేనే లోపలికి అనుమతిస్తామని, లేనిపక్షంలో బయటే ఉండాలని యాజమాన్యం స్పష్టం చేసినట్లు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. దీంతో విద్యార్థులు స్పెషల్ క్లాసులకు దూరమయ్యారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.×పదో తరగతి విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమా?×పదో తరగతి పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు స్పెషల్ క్లాసులు ఎంతో కీలకమని, ఇలాంటి సమయంలో వారిని తరగతులకు దూరంగా ఉంచడం వల్ల చదువుపై ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల మత విశ్వాసాలను గౌరవించాల్సిన బాధ్యత పాఠశాల యాజమాన్యంపై ఉందని పేర్కొంటున్నారు.×విద్యాశాఖ అధికారులు స్పందించాలి×విద్యార్థుల మత విశ్వాసాలు, విద్యా హక్కులను దృష్టిలో ఉంచుకొని విద్యాసంస్థలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ ఘటనపై విద్యాశాఖ అధికారులు వెంటనే విచారణ చేపట్టి, ఆరోపణల్లో వాస్తవాలను నిర్ధారించాలని డిమాండ్ చేస్తున్నారు. విద్యార్థులందరికీ ఎలాంటి వివక్షకు తావులేకుండా స్పెషల్ క్లాసులకు హాజరయ్యే అవకాశం కల్పించాలని, బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.విద్యార్థుల చదువుకు ఆటంకం కలగకుండా, వారి విశ్వాసాలను గౌరవిస్తూ సమస్యను పరిష్కరించాలని తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.



## రైల్వే పనుల ముసుగులో ఇసుక డంపులు..



మాగనూరు : రైల్వే పనుల కోసం ఇసుకను నిల్వ చేస్తున్నామనే పేరుతో భారీగా ఇసుక డంపులు ఏర్పాటు చేస్తున్నారనే ఆరోపణలు మాగనూరు మండల పరిధిలో చర్చనీయాంశంగా మారాయి. రైల్వే పనులకు అవసరమైన ఇసుక నిల్వల పేరుతో నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను డంప్ చేస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు దృష్టి సారించడం లేదంటూ గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.రైల్వే పనుల కోసం ఇసుకను నిల్వ చేయడం తప్పు కాకపోయినా, అందుకు అవసరమైన అనుమతులు ఉన్నాయా? ఇసుక ఎక్కడి నుంచి తీసుకొస్తున్నారు? రవాణాకు సంబంధించి అనుమతి పత్రాలు ఉన్నాయా? నిల్వలు నిబంధనలకు అనుగుణంగానే ఉన్నాయా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి వాస్తవాలను వెల్లడించాలని కోరుతున్నారు. ఇసుక డంపుల వ్యవహారంలో పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారంటూ గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.రైల్వే పనుల నిమిత్తం ఇసుకకు ఎలాంటి అనుమతులు తీసుకోలేదని తహసీల్దార్ రెహమాన్ వెల్లడించారు. పెద్ద మొత్తంలో వేసిన ఇసుక డంపులను పరిశీలించడానికి ఆర్ఐ సుధాకర్, సిబ్బందిని పంపించానని అక్రమంగా ఇసుక డంపులు వేసినట్లయితే ఇసుక డంపులు సీజ్ చేస్తామన్నారు. రాత్రివేళలో అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలతో పాటు కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

## సంపాదకీయం

# కమ్యూనిటీల్లో నీటి కటకట

పెరుగుతున్న మెయింటెనెన్స్ చార్జీలు చదరపు అడుగుకు రూ.4.50 పెంచేందుకు కసరత్తు నీటిని పొదుపు చేయాలంటూ నోటీసు బోర్డుల్లో హెచ్చరికలు మహానగరాన్ని తాగునీటి సమస్య చుట్టుముడుతున్నది. నగరంలో పరిస్థితులు ఇప్పటికే వేసవిని తలపిస్తు న్నాయి. ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఎల్‌నినో,వర్షాభావ పరిస్థితుల వల్ల భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. బోర్లు ఎండిపోతున్నాయి. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురియకపోవడంతో నగరానికి నీళ్లు సరఫరా చేసే జలాశయాల్లోనూ నీటి మట్టాలు రోజురోజుకు డెడ్ స్టోరేజీకి చేరుకుంటున్నాయి. నగరానికి రాబోయే రోజుల్లో నీటి ఎద్దడి పెరగనుంది.ఇప్పటికే సాధారణంగానే నీటి కొరత ఉండే కాలనీలు, బస్తీల ప్రజలకు ఇబ్బందులు మొదలయ్యాయి. దీంతో జలమండలి వినియోగదారులు ట్యాంకర్లను ఆశ్రయిస్తున్నారు. సైబర్ సిటీ ప్రాంతం పరిస్థితి మరింత దారుణంగా మారుతున్నది. ఈ నేపథ్యంలో నీటిని ఎక్కువ మొత్తంలో వినియోగించే గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్లలో పరిస్థితులు ప్రమాదకరంగా మారుతున్నాయి. జలమండలి నుంచి బల్క్ సరఫరా చేస్తున్నా బోర్లు ఎండిపోవడం వల్ల ఏమాత్రం సరిపోవడం లేదు. దీంతో వందలాది ట్యాంకర్లను బుక్ చేస్తున్నారు. ముఖ్యంగా శివారు ప్రాంతాలైన ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, సైబర్ సిటీ ప్రాంతాల్లో తీవ్రత ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తున్నది. రానున్న రోజుల్లో గేటెడ్ కమ్యూనిటీలకు నీటి కటకట మరింత పెరిగే ప్రమాదమున్నది. గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్లలో ఇప్పటికే నీటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి.ఈ నేపథ్యంలో కమ్యూనిటీల్లో అసోసియేషన్లు, కాలనీల అసోసియేషన్లు నివాసితులను అప్రమత్తం చేస్తున్నారు. రానున్న రోజుల్లో నీటి సమస్యలు తలెత్తనున్న నేపథ్యంలో పొదుపుగా వినియోగించాలని, లేదంటే మెయింటెనెన్స్ చార్జీలు భారీగా పెంచాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం పలు సొసైటీల్లో నీళ్ల కోసం ఒక చదరపు అడుగుకు రూ.3 రూపాయలు వసూలు చేస్తున్నారు. దీన్ని రూ.4.50కు పెంచేందుకు అసోసియేషన్లు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తున్నది. సొసైటీ గ్రూపుల్లో నిత్యం నోటీసులు ఇస్తున్నారు.నీటి వృథాను అరికడుతూ, వినియోగం సాధ్యమైనంత వరకు తగ్గించుకోవాలని సూచనలు చేస్తున్నారు. ఇప్పటికే చాలా ప్రాంతాల్లో నీటి ఇబ్బందులు ప్రారంభమయ్యాయి. హైటెక్ సిటీ, మాదాపూర్,కొండాపూర్,ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్,రాయదుర్గం, మణికొండ, గచ్చిబౌలి, అమీన్‌పూర్, నల్లగండ్ల, కొల్లూరు, తెల్లాపూర్ ప్రాంతాల్లో గేటెడ్ కమ్యూనిటీల నివాసితులు ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేస్తున్నారు.ఆయా కమ్యూనిటీల్లో బోర్లు ఎండిపోతుండటంతో ఆర్‌వో ప్లాంట్లకు ట్యాంకర్ల నీటిని తీసుకుని శుద్ధి చేయడం ప్రారంభించారు. రాబోయే రోజుల్లో ట్యాంకర్ల సంఖ్యను గణనీయంగా పెంచుకోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో ట్యాంకర్లకు భారీగా డిమాండ్ పెరుగుతున్నది. జలమండలి ట్యాంకర్లు సకాలంలో డెలివరీ చేయకపోవడంతో ప్రైవేట్ ట్యాంకర్లను ఆశ్రయిస్తున్నారు. దీంతో ధరలకు రెక్కలొస్తున్నాయి. 20 వేల లీటర్ల కెపాసిటీ కలిగిన ట్యాంకర్‌కు రూ.10 వేల దాకా వసూలు చేస్తున్నారు. దీంతో అదనపు భారం పడుతుందని ఆందోళన చెందుతున్నారు. తప్పని పరిస్థితుల్లో నీటి ఛార్జీలు పెంచాల్సి వస్తుందని చెప్తున్నారు.35-40 శాతం తగ్గనున్న సరఫరా ఎల్‌నినో, వర్షాభావ పరిస్థితుల వల్ల గ్రేటర్ హైదరాబాద్‌కు నీటి కొరత పొంచి ఉండటంతో జలమండలి అప్రమత్తమైంది. గేటెడ్ కమ్యునిటీలు ఉన్న ప్రాంతాల్లో ఇప్పటికే భూగర్భ జలాలు 45 శాతం దాకా సాధారణం కంటే దిగువకు పడిపోయినట్లు నివేదికలు చెప్తున్నాయి. ఈనేపథ్యంలో ఇప్పటికే బల్క్ కనెక్షన్ కలిగిన వినియోగదారులకు నీటి పొదుపుపై జలమండలి సూచనలు చేస్తున్నది. నీటిని పొదుపుగా వాడుకోవాలని, రాబోయే రోజుల్లో సరఫరా 35 నుంచి 40 శాతం తగ్గనున్నట్లు గేటెడ్ కమ్యూనిటీలు, కాలనీల సొసైటీలకు ముందస్తుగానే హెచ్చరించినట్లు తెలుస్తున్నది. ఈనేపథ్యంలో నీటిని దుర్వినియోగం చేస్తే కఠినంగా వ్యవహరించనున్నట్లు ప్రకటించారని గేటెడ్ కమ్యూనిటీల అసోసియేషన్లు తెలిపాయి. ఈమేరకు తాము కూడా నీటి ఎద్దడి దృష్టిలో ఉంచుకుని నీటిని పొదుపు చేస్తున్నట్లు చెప్తున్నారు.పరిస్థితి ఆందోళనకరంగా ఉంది ఎల్‌నినో, వర్షాభావ పరిస్థితుల వల్ల సిటీలో పరిస్థితులు ఆందోళనకరంగా మారాయి. అన్ని ప్రాంతాల్లో నీటి డిమండ్ క్రమంగా పెరుగుతున్నది. ఈనేపథ్యంలో ప్రజలు ట్యాంకర్లను ఆశ్రయిస్తున్నారు. అటు గేటెడ్ కమ్యూనిటీలో నీటి సమస్య పెరుగుతుండటంతో బయట నుంచి కొనుగోలు చేయాల్సి వస్తున్నది. దీంతో మెయింటెనెన్స్ ఛార్జీలు పెంచడం ప్రారంభమైంది. నోటీసు బోర్డులు, వాట్సాప్ గ్రూపుల్లో సూచనలు చేయాల్సి వస్తున్నది. బస్తీల నుంచి గేటెడ్ కమ్యూనిటీల దాకా నీటి గురించే చర్చ జరుగుతున్నది. జలమండలి కూడా అప్రమత్తం కావాల్సి వస్తున్నది. పంపింగ్‌లో సమస్యలు, పైపులైన్ల లీకేజీలు, పంపిణీలో అసమానతలు, పెరుగుతున్న డిమాండ్ వల్ల నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వీటన్నింటిని అదుపు చేస్తే కొంతమేర ఇబ్బందుల తీవ్రత తగ్గే అవకాశం ఉంది. ఆ దిశగా జలమండలి పనిచేయాల్సిన అవసరం ఉంది.

-బీటీ శ్రీనివాసన్, జనరల్ సెక్రెటరీ, ఆర్‌డబ్ల్యూఏ

# జలమండలి అధికారులను కలిసిన కళ్లెం నవజీవన్ రెడ్డి



హయత్ నగర్, జ్యోతి ప్రభంజనం, అక్టోబర్ 12:ఉమ్మడి హయత్ నగర్ డివిజన్ పరిధిలోని వివిధ కాలనిలో, మంచినీటి పైప్‌లైన్ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని కోరుతూ హయత్ నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి జలమండలి సీజీఎం నాగేంద్ర బాబు ని వారి కార్యాలయంలో కలవడం జరిగింది.ఈ సందర్భంగా కాలనీలలో పెండింగ్‌లో ఉన్న పనుల కారణంగా స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా భూగర్భ డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్ పనులను త్వరితగతిన పూర్తి చేసి, సమస్యలను పరిష్కరించాలని కోరారు.దీనిపై సంబంధిత అధికారులు సానుకూలంగా స్పందించి, పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# సూర్యుడు - శుభ గడియలు

శుభ గడియలు తెచ్చే సూర్యుడా!
శుభోదయాన్ని ఇచ్చే దేవుడా!



చీకటిని తొలగించే వెలుగువా!
మా మనసుల్లో ఆశలు నింపే సూర్యుడా!
పండుగల వేళ ఆనందం నీవే!
మంచి రోజులకు వెలుగు నీవే!
మనిషి జీవితానికి ఆధారం నీవే!
ప్రతి ఉదయానికి అందం నీవే!
తూర్పు దిక్కున ఉదయించే సూర్యుడా!
ప్రతి ప్రాణికి వెలుగు ఇచ్చే దేవుడా!
నీ వేడితో పంటలు పండుతున్నాయి!
నీ కాంతితో పూలు పూస్తున్నాయి!
చెట్లకు జీవం ఇచ్చే సూర్యుడా!
జీవులలో ఉత్సాహం నింపే దేవుడా!
ప్రతి రోజు నీ రాక ఒక వరం!
నీకు నమస్కరించడం మా భక్తికి గుర్తు!
రోజంతా నీ ప్రయాణం ఆగదు!
నీ పనిలో అలసట కనిపించదు!
మా జీవితాలకు నీవే ఆదర్శం!
మా ఆశలకు నీ వెలుగే ఆధారం!
ఓం శ్రీ ఆదిత్యాయ నమో నమః!
ఓం శ్రీ భాస్కరాయ నమో నమః!
నీ వెలుగుతో లోకమంతా నిండాలి!
ప్రతి ఇంటా సుఖశాంతులు ఉండాలి!
రచన: కె. మురళీమోహన్ రాజు, నెల్లూరు. చరవాణి: 9866179385

# మార్గదర్శి

దారికోసం వెతుకుతూ కూర్చోకు,
తుకుతూ కూర్చోకు,
నీదంటూ దారి లేనప్పుడు వెనకడుగు వేయకు!
లోకం నడిచిన బాటలోనే నడిస్తే,
నీ ప్రయాణానికి ప్రత్యేకత ఎక్కడుంటుంది?
అడుగులు పడని నేలపై అడుగులు మోపు,
అడ్డంకుల గుండెలపై విజయధ్వజం నాటు!
ఎవరూ చూపని దారిని నువ్వే నిర్మించు,
ఎదురొచ్చే ప్రతి అవరోధాన్ని ధైర్యంతో ఎదురించు!
ఓటమి ఎదురైతే కుంగిపోకు,
అవమానం ఎదురైతే ఆగిపోకు!
కష్టాల కొలిమిలో కరిగినప్పుడే,
నీ వ్యక్తిత్వం ఉక్కులా దృఢమవుతుంది!
నీ ప్రయాణం నీకోసమే మొదలైనా,
నీ గమ్యం పదిమందికి స్ఫూర్తి కావాలి!
నీ విజయం నీ ఒక్కడి గెలుపు కాకుండా,
ఎందరికో కొత్త జీవితానికి తొలిమెట్టు కావాలి!
విమర్శించే నోళ్లను లెక్కపెట్టకు, విజ్ఞతతో
నీ లక్ష్యాన్ని విడిచిపెట్టకు!
నీ సంకల్పమే నీకు దిక్సూచి కావాలి,
నీ ఆత్మవిశ్వాసమే నీకు ఆయుధం కావాలి!
చీకటిని నిందిస్తూ కాలం గడపకు,
చిన్న దీపమై వెలగడానికి వెనుకాడకు!
నీ అడుగుల్లో నిజాయితీ ప్రతిఫలిస్తే,
నీ బాటలో నమ్మకం పూలై విరుస్తుంది!



నువ్వు వేసిన బాటలో నలుగురు నడిచినప్పుడు,
నీ కష్టం ఒక చరిత్రగా నిలిచిపోతుంది!
నువ్వు చూపిన దారిలో జీవితాలు మారినప్పుడు,
నీ ఉనికి ఒక ఆదర్శంగా మిగిలిపోతుంది!
దారులు లేనప్పుడు దారిని నిర్మించేవాడే నాయకుడు,
తన వెనుక వచ్చేవారికి వెలుగును పంచేవాడే మార్గదర్శి!
రచన : ఆర్.కె.రెడ్డిగోగులపల్లి, నెల్లూరు జిల్లా.

# నిశ్శబ్దమే సమాధానం

కోరుకున్నది దక్కించుకోవడానికి ప్రతిసారీ యుద్ధమే అవసరం లేదు!



ప్రతి గెలుపు వెనుక పోరాటం ఉండదు, ప్రతి ఓటమి వెనుక బలహీనత ఉండదు!కొన్నిసార్లు నిశ్శబ్దమే గొప్ప ఆయుధం, వేచి చూడటమే విజ్ఞతకు నిదర్శనం!
మనదైనది అయితే కాలం కలిపిస్తుంది, మనది కానిదైతే దూరం విడదీస్తుంది!
వెంటపడినంత మాత్రాన ఏదీ సొంతం కాదు, పోరాడినంత మాత్రాన విజయం దాసోహం కాదు!
బలవంతంగా పొందినది ఆనందాన్నివ్వదు, మనస్ఫూర్తిగా వచ్చినదే మధురానుభూతినిస్తుంది!
దక్కనిదాని కోసం దహించుకుపోకు, దూరమైన దాని కోసం దిగులుతో కృంగిపోకు!
నీ విలువను తగ్గించుకొని ఎవరి వెంటా పడకు,
నీ ఆత్మగౌరవాన్ని ఆశల పాదాల దగ్గర తాకట్టు పెట్టకు!
నీది కానిదాన్ని వదిలేయడమూ ఒక గెలుపే,
నీ మనశ్శాంతిని కాపాడుకోవడమే అసలైన విజయం!
ఎందుకంటే, నీకు చెందనిదాన్ని ఎంత పోరాడినా పొందలేవు,
నీకు చెందాల్సినదాన్ని నిశ్శబ్దంగా ఉన్నా కాలం
నీ దగ్గరకు చేరుస్తుంది!
రచన : కె.మురళీమోహన్ రాజు, నెల్లూరు.చరవాణి : 9866179385

# ప్రజాస్వామ్య పరిరక్షణ పోరాటానికి రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ సంఘీభావం

### ఢిల్లీ నిరసన కార్యక్రమంలో పాల్గొన్న డీసీసీ అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి

రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి, జ్యోతి ప్రభంజనం, అక్టోబర్ 12:కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ప్రజాస్వామ్య పరిరక్షణ పోరాటానికి రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ తరపున డీసీసీ అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి సంఘీభావం తెలిపారు.దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించిన భారీ నిరసన కార్యక్రమంలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీకి చెందిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ముఖ్య నాయకులతో కలిసి ఆమె పాల్గొన్నారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్య సూత్రాలు, రాజ్యాంగ విలువల పరిరక్షణకు కట్టుబడి ఉంటుందని పారిజాత నర్సింహారెడ్డి పేర్కొన్నారు. ప్రజల గొంతుకను వినిపించే హక్కును అణచివేసే ప్రయత్నాలను ఐక్యంగా ఎదుర్కొంటామని స్పష్టం చేశారు.ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం సాగుతున్న పోరాటంలో భాగంగా ప్రజల హక్కుల సాధనకు నిరంతరం కృషి చేస్తామని ఆమె తెలిపారు. రాజ్యాంగ విలువలను కాపాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతామని పేర్కొన్నారు.

### ధరలు పెరుగుదలకు నిరసనగా

# “కర్రీ పాయింట్ కేంద్రాల” మూసివేత




భద్రాద్రి కొత్తగూడెం(జ్యోతి ప్రభంజనం):నిత్యవసర ధరలు రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో అందుకు నిరసనగా కొత్తగూడెం కర్రీ పాయింట్ అసోసియేషన్ సూచన మేరకు సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని వలు ప్రాంతాలలో వ్యాపారస్తులు కర్రీ పాయింట్ కేంద్రాలను మూసి వేయడం జరిగింది. అన్ని రకాల నిత్యవసర ధరలు పెరగడం వల్ల కర్రీ పాయింట్ వ్యాపారస్తులకు సరైన గిట్టుబాటు ధర లభించిన కారణంగా కర్రీ పాయింట్ కేంద్రాలను మూసివేసినట్లుగా కొందరు వ్యాపారాలు ఆవేదన వ్యక్తం చేస్తూ పేర్కొనడం జరిగింది. పెరుగుతున్న ధరలను దృష్టిలో పెట్టుకొని కొత్త రేట్లతో కర్రీ పాయింట్ కేంద్రాలు మంగళవారం నుండి యధావిధిగా కొనసాగనున్నాయి.

## బీఎన్ రెడ్డి నగర్‌లో పీవీకే డెంటల్ హాస్పిటల్ ప్రారంభం..




నాణ్యమైన దంత వైద్య సేవలు ప్రజలకు అందుబాటులోకి రావాలి: జ్యోతి ప్రభంజనం, బీఎన్ రెడ్డి నగర్: హైదరాబాద్‌లోని బీఎన్ రెడ్డి నగర్ టీచర్స్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన పీవీకే డెంటల్ హాస్పిటల్ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు మొద్దు లచ్చిరెడ్డి, బానోత్ సుజాత నాయక్, డాక్టర్ సూర్యప్రకాష్‌రావు హాజరై హాస్పిటల్‌ను నిర్వాహకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా



వారు మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉండటం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ముఖ్యంగా దంత సమస్య ల పట్ల ప్రజలు నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఆధునిక వైద్య సదుపాయాలతో స్థానికంగా దంత వైద్య సేవలు అందుబాటులోకి రావడం పరిసర ప్రాంతాల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని ఆకాంక్షించారు. హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ అక్షయ్, డాక్టర్ సాయి చందు లు మాట్లాడుతూ రోగులకు మెరుగైన దంత వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, వైద్య సిబ్బంది, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్ అనవసర రాద్ధాంతం చేస్తోంది

### ఓటమి భయంతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం

జూబ్లీహిల్స్, జ్యోతి ప్రభంజనం, అక్టోబర్ 12:ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు అనవసర రాద్ధాంతం చేస్తున్నాయని బీజేపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ జూటూరు కీర్తిరెడ్డి విమర్శించారు. సోమవారం జూబ్లీహిల్స్‌లో ఆమె మాట్లాడుతూ ఓటమి భయంతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నాయని ఆరోపించారు. ఓటర్ల జాబితాలోని అవకతవకలను సరిచేసి, అర్హులైన ప్రతి ఓటరుకు న్యాయం చేయడమే ఎస్ఐఆర్ ప్రక్రియ ఉద్దేశమని పేర్కొన్నారు. ఓటమి భయంతోనే ఆందోళనలుదేశవ్యాప్తంగా బీజేపీకి లభిస్తున్న ఆదరణను కాంగ్రెస్ జీర్ణించుకోలేకపోతోందని కీర్తిరెడ్డి విమర్శించారు. పలు అంశాలపై నిరసనలు, ధర్నాలు నిర్వహిస్తూ మీడియా దృష్టిని ఆకర్షించేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఎన్ని రాజకీయ వ్యూహాలు అనుసరించినా ప్రజల్లో బీజేపీపై ఉన్న విశ్వాసాన్ని తగ్గించలేరని అన్నారు. పశ్చిమ బెంగాల్, అస్సాంలో ఎన్నికల ఫలితాల గురించి ప్రస్తావిస్తూ కాంగ్రెస్ రాజకీయాలపై విమర్శలు చేశారు. దొంగ ఓట్లను తొలగించకూడదా? ఎస్ఐఆర్ ప్రక్రియ ఏ ఒక్క రాజకీయ పార్టీకి వ్యతిరేకం కాదని కీర్తిరెడ్డి అన్నారు. ఓటర్ల జాబితాలో ఒకే వ్యక్తికి పలుచోట్ల ఓట్లు ఉండటం, అర్హత లేని ఓట్లు కొనసాగడం వంటి సమస్యలను సరిచేయాల్సిన అవసరం లేదా అని ప్రశ్నించారు. గతంలో రాహుల్ గాంధీ ఓటర్ల జాబితాలో అవకతవకలపై ప్రజెంటేషన్ ఇచ్చారని గుర్తుచేస్తూ, ఇప్పుడు అదే సమస్యలను సరిచేసే ప్రయత్నాలను కాంగ్రెస్ వ్యతిరేకించడం ఏమిటని ప్రశ్నించారు. ఓటర్ల జాబితాలో మార్పులపై అభ్యంతరాలుంటే సంబంధిత ఎన్నికల అధికారులను సంప్రదించి, తొలగించబడిన అర్హులైన ఓటర్ల వివరాలను సమర్పించాలని సూచించారు. అలా కాకుండా నిరసనలు, రాస్తారోకోలు నిర్వహించడం ద్వారా ప్రజల్లో గందరగోళం సృష్టించడం సరికాదని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యంలో పారదర్శకత, జవాబుదారీతనం అవసరమని అన్నారు. ఓట్ చోరీపై మాట్లాడే హక్కు కాంగ్రెస్‌కు ఉందా? ఓట్ చోరీ అంశంపై కాంగ్రెస్ చేస్తున్న విమర్శలను కీర్తిరెడ్డి తప్పుబట్టారు. మాజీ ప్రధానమంత్రులు జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీ పాలనలో జరిగిన పరిణామాలను ప్రస్తావిస్తూ కాంగ్రెస్ నాయకత్వాన్ని ప్రశ్నించారు. ఎమర్జెన్సీ సమయంలో ప్రజాస్వామ్య హక్కులకు భంగం కలిగిందని విమర్శించారు. ఓటుకు నోటు కేసును ప్రస్తావిస్తూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కూడా విమర్శలు చేశారు. ఎన్నికల సంఘం పనితీరును తప్పుబట్టే ముందు కాంగ్రెస్ తన గత చరిత్రను సమీక్షించుకోవాలని అన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియ అనంతరం కేరళలో కాంగ్రెస్ విజయం సాధించిన విషయాన్ని ప్రస్తావిస్తూ, ఈ అంశాలపై



రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీల సంగతేంటి? తెలంగాణలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై దృష్టి పెట్టకుండా సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీలో నిరసన కార్యక్రమాల్లో పాల్గొనడాన్ని కీర్తిరెడ్డి విమర్శించారు. రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపడంతో పాటు, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సూచించారు. రాష్ట్రంలో సమస్యలను పరిష్కరించకుండా ఢిల్లీలో రాజకీయ కార్యక్రమాలు నిర్వహించడం వల్ల ప్రజలకు ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు. కాంగ్రెస్ అసలు ఉద్దేశం ఏమిటి? ఎస్ఐఆర్ ప్రక్రియలో నిజమైన ఓటర్ల హక్కులను కాపాడటమే కాంగ్రెస్ లక్ష్యమా? లేక నకిలీ, డూప్లికేట్, అనర్హమైన ఓట్ల తొలగింపుతో రాజకీయంగా నష్టం జరుగుతుందనే భయమా? అని కీర్తిరెడ్డి ప్రశ్నించారు. ఓటర్ల జాబితా ప్రక్షాళనపై తమ వైఖరిని కాంగ్రెస్ స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

## విద్యావేత్త దుగ్యాల రాముకు జీవితకాల సాఫల్య పురస్కారం ప్రదానం



హైదరాబాద్, జ్యోతి ప్రభంజనం,అక్టోబర్ 12: శారదా ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో లక్డీకాపూల్ పబ్లిక్ గార్డెన్స్‌లోని భగవాన్ మహావీర్ ఆడిటోరియం (డాక్టర్ వైఎస్ఆర్ రాష్ట్ర మ్యూజియం) లో అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ వేడుకల్లో భాగంగా, విద్యా రంగంలో సేవలు అందిస్తున్న విద్యావేత్త దుగ్యాల రాము 'జీవితకాల సాఫల్య పురస్కారం' అందుకున్నారు. తెలంగాణ ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్-1 ప్రొఫెసర్ ఎటికాల పురుషోత్తం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన దుగ్యాల రామును శాలువాతో సత్కరించి, ఈ జీవితకాల సాఫల్య పురస్కారాన్ని అందజేశారు. విద్యా రంగంలో రాము అందించిన సేవలను, సహకారాన్ని శారదా ఎడ్యుకేషనల్ సొసైటీ కమిటీ ప్రతినిధులు కొనియాడారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి ప్రొఫెసర్ ఎటికాల పురుషోత్తం మాట్లాడుతూ, సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల, విద్యావేత్తల పాత్ర కీలకమైనదన్నారు. నిస్వార్థంగా విద్యాసేవ అందిస్తూ ఎంతో మంది విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసిన దుగ్యాల రాముకు ఈ జీవితకాల సాఫల్య పురస్కారం దక్కడం తగిన గుర్తింపు అని పేర్కొన్నారు. ఈ సేవలు రాబోయే తరాల ఉపాధ్యాయులకు స్ఫూర్తినిస్తాయని చెప్పారు. అవార్డు గ్రహీత దుగ్యాల రాము మాట్లాడుతూ, అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేళ తన సేవలను గుర్తించి ఈ పురస్కారానికి ఎంపిక చేసినందుకు శారదా ఎడ్యుకేషనల్ సొసైటీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ గౌరవం తనపై బాధ్యతను మరింత పెంచిందని, విద్యా రంగ వృద్ధికి మరింత కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ వేడుకలో శారదా ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రతినిధులు, విద్యావేత్తలు, పలువురు మేధావులు పాల్గొని దుగ్యాల రాముకు శుభాకాంక్షలు తెలియజేశారు

# భద్రాద్రి జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలి

- పాలకుల నిర్లక్ష్యంతో వ్యవసాయం సంక్షోభం
- సాగుదారులకు సర్కారు భరోసా కల్పించాలి
- రైతు వ్యతిరేక విధానాలను తిప్పికొడతాం
- సమస్యల పరిష్కారానికి సమరశీల పోరాటాలు
- ఏఐకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల విశ్వనాథం
- ఏఐకేఎస్ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా



భద్రాద్రి కొత్తగూడెం(జ్యోతి ప్రభంజనం): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను తక్షణమే కరువు జిల్లాగా ప్రకటించి నష్టపోయిన అన్నదాతలకు ఎకరాకు తగిన పరిహారం అందించి ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం (ఏఐకేఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల విశ్వనాధం డిమాండ్ చేశారు. రైతాంగ సమస్యల పరిష్కారం కోరుతూ సోమవారం భద్రాద్రి కొత్తగూడెం కలెక్టరేట్ ఎదుట ఏఐకేఎస్ ఆధ్వర్యంలో రైతులు భారీ ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కు డిమాండ్ల వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ముత్యాల విశ్వనాధం మాట్లాడుతూ పాలకుల నిర్లక్ష్యంతో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం పంటలకు గిట్టుబాటు మద్దతు ధర కల్పించి ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేయాలన్నారు. అర్హులైన పోడు రైతులకు హక్కు పత్రాలు ఇవ్వడంతో పాటు కౌలు రైతులకు అధికారిక గుర్తింపు కార్డులు జారీ చేసి బ్యాంకుల ద్వారా పంట రుణాలు అందించాలని కోరారు. వ్యవసాయానికి పగటిపూటే నిరంతర నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని పెండింగ్ ప్రాజెక్టుల కాల్వల పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే రైతాంగాన్ని ఏకం చేసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఏఐకేఎస్ జిల్లా అధ్యక్షులు చంద్ర నరేంద్ర కుమార్ మాట్లాడుతూ రైతులకు పంట పెట్టుబడి సాయాన్ని ఎకరాకు రూ. 15 వేల చొప్పున ఎలాంటి కోతలు విధించకుండా రైతులందరికీ అందించాలని డిమాండ్ చేశారు. గతంలో ప్రకటించిన రూ. 2 లక్షల రుణమాఫీని ఏకకాలంలో పూర్తిస్థాయిలో వర్తింపజేసి అన్నదాతలను రుణవిముక్తులను చేయాలన్నారు. నాణ్యమైన విత్తనాలు ఎరువులను సకాలంలో అందుబాటులో ఉంచాలని ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోయిన



రైతులకు ప్రభుత్వం తరపున తక్షణ ఆర్థిక సహాయం అందించడంతో పాటు సమగ్ర పంటల బీమా పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కల్లూరి వెంకటేశ్వరరావు, సలిగంటి శ్రీనివాస్, పూర్ణచందర్ రావు, వైఎస్ గిరి, గుగ్రం వెంకటేశ్వర్లు, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి వినతులకు సత్వర పరిష్కారం చూపాలి

- ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం జాప్యానికి తావివ్వొద్దు
- జిల్లా జాయింట్ కలెక్టర్ డి.వేణుగోపాల్



భద్రాద్రి కొత్తగూడెం(జ్యోతి ప్రభంజనం):వివిధ మండలాల నుండి వచ్చిన ప్రజల నుంచి స్వీకరించే ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా అధికారులు బాధ్యతతో పనిచేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ వేణుగోపాల్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్ఓ పద్మావతి, ఉపాధి కల్పన అధికారి శ్రీరామ్, హౌసింగ్ పిడితో కలిసి ప్రజల నుంచి వినతులు ఫిర్యాదులను స్వీకరించారు. భూ సంబంధిత సమస్యలు రెవెన్యూ అంశాలు సంక్షేమ పథకాలు ఉపాధి పింఛన్లు గృహాలు మౌలిక వసతులు సామాజిక భద్రత తదితర సమస్యలను ప్రజలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రజావాణి కార్యక్రమం ముఖ్యమైన వేదికగా నిలుస్తోందన్నారు. ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి దరఖాస్తును అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం జాప్యానికి తావివ్వరాదని స్పష్టం చేశారు. తక్షణమే పరిష్కరించగల సమస్యలను ఎలాంటి ఆలస్యం లేకుండా పరిష్కరించాలని క్లిష్టమైన సమస్యలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తూ ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తుల పరిష్కార స్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంతో పాటు మండల స్థాయిలోని ఎంపీడీవో కార్యాలయాల్లో కూడా ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ తెలిపారు. ప్రజలు తమకు సమీపంలోని ఎంపీడీవో కార్యాలయంలో వినతులు సమర్పించి స్థానిక స్థాయిలోనే సమస్యలకు పరిష్కారం పొందాలని సూచించారు. వినతులతో పాటు సంబంధిత ఆధార పత్రాలను సమర్పిస్తే సమస్యల పరిష్కారం మరింత వేగంగా జరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. సంబంధిత అధికారులు ప్రజావాణిలో సమర్పించిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి వారి సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## శంషాబాద్‌లోని కిషన్‌గూడ ఫ్లైఓవర్‌పై గుర్తుతెలియని పురుషుడి మృతదేహం లభ్యం



శంషాబాద్, జ్యోతి ప్రభంజనం,ప్రతినిధి, అక్టోబర్ 12 :శంషాబాద్‌లోని కిషన్‌గూడ ఫ్లైఓవర్‌పై సుమారు 50-55 ఏళ్ల వయసున్న గుర్తుతెలియని ఒక పురుషుడు మృతదేహం లభ్యమైంది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కనుగొన్నారు. ప్రాథమిక విచారణలో మృతుడు గత కొన్ని నెలలుగా శంషాబాద్, దాని పరిసర ప్రాంతాల్లో భిక్షాటన చేస్తున్నట్లు వెల్లడైంది. మరణానికి గల కారణం ఇంకా తెలియాల్సి ఉంది. అతని గుర్తింపును నిర్ధారించడానికి మరియు మరణానికి గల పరిస్థితులను తెలుసుకోవడానికి తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది.

# ధనుంజయ నాయుడుకు కళాసేవ ప్రతిభ అవార్డు -2026

సూర్యాపేట, జ్యోతి ప్రభంజనం, అక్టోబర్ 12:సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల వాసి సామాజిక కార్యకర్త,, ప్రజా కళాకారుడు,, బీసీ ఉద్యమకారుడు వామపక్ష ఉద్యమ నేత ధూళిపాళ ధనుంజయ నాయుడు కు కళాసేవ ప్రతిభ అవార్డు 2026 ను అందజేశారు ఇటీవల హైదరాబాదులోని అలైడ్ ఆర్టిస్ట్ ఆడిటోరియం శ్రీ ముఖి కాంప్లెక్స్ హిమాయత్ నగర్, హైదరాబాద్ ను ఆలూరి కల్చరల్ అండ్ సోషల్ ఆర్గనైజేషన్ వారి 24వ వార్షికోత్సవ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా స్వచ్ఛంద సేవ సంస్థలకు స్వచ్ఛంద ఉద్యమకారులకు జానపద కళాకారులకు అవార్డులు ప్రకటించి ప్రధానం చేశారు ఈ సందర్భంగా ధనుంజయ నాయుడు మాట్లాడుతూ... ఈ అవార్డు అందుకోవడం పట్ల తన బాధ్యతను మరింతగా పెరిగిందని విద్యార్థులు యువకులు మహిళలు వ్యవసాయ కార్మికులు, రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు దేశ జనాభాలో 61 శాతం ఉన్న బీసీలకు జరుగుతున్న వివక్షత పట్ల మరింతగా సమరశీల పోరాటాలు నిర్వహిస్తానని దేశానికి వెన్నుముకైన కర్షకులు వ్యవసాయ కార్మికులు గ్రామీణ,పట్టణ కార్మికులు ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వల్ల తీవ్ర ఇక్కట్లు అనుభవిస్తున్నారని పేదవాడిని మరింత పేదవాడుగా చేసే విధానాలని కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్నదని ముఖ్యంగా కార్మిక చట్టాలను రద్దు చేయడం ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసేందుకు నల్ల చట్టాలు తీసుకురావడం లాంటి చర్యలు ఇందుకు దోహదం చేస్తున్నాయని అయినప్పటికీ వెనకడుగు వేసే ప్రసక్తే లేదని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు తాయిలాలు ఇస్తూ ఎన్నికల పబ్బం గడుపుకుంటున్నారని ఇక వారి ఆటలు ఎంతో కాలం సాగబోవని బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ వర్గాలు ఈ దేశంలో 92 శాతం మంది ఉన్నారని వారంతా చైతన్యవంతమై



బహుజన రాజ్యాధికారం సాధించుకోవాలని తద్వారా కార్మిక రైతాంగ వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న వారి ఆటలు కట్టించవచ్చని అన్నారు ధనుంజయ నాయుడుకు అవార్డు రావడం పట్ల కత్తి శ్రీనివాసరెడ్డి రావుల సత్యం ముళ్ళ జానయ్య అమరారపు పున్నయ్య చిలకరాజు శ్రీను కొమర్రాజు వెంకట్ పరికె భరత్ బత్తిని శ్రీనివాస్ గౌడ్ ముత్యాల భాస్కర్ బెల్లంకొండ గోవిందు గౌడ్ ఊదర వెంకన్న బండి శ్రీనివాస్ ఎస్కే సయ్యద్ పాషా నూతనగంటి నరసమ్మ హర్షం వ్యక్తం చేశారు.

# డాక్టర్ దుగ్గ్యాల రాము విద్యా సేవలకు మహోన్నత గుర్తింపు..

## జీవితకాల సాఫల్య పురస్కార ప్రదానం

హైదరాబాద్, జ్యోతి ప్రభంజనం, అక్టోబర్ 12:శారదా ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో లక్డీకాపూల్ పబ్లిక్ గార్డెన్స్‌లోని భగవాన్ మహావీర్ ఆడిటోరియం (డాక్టర్ వైఎస్ఆర్ రాష్ట్ర మ్యూజియం) లో అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ వేడుకల్లో భాగంగా, విద్యా రంగంలో సేవలు అందిస్తున్న విద్యావేత్త దుగ్యాల రాము 'జీవితకాల సాఫల్య పురస్కారం' అందుకున్నారు. తెలంగాణ ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్-1 ప్రొఫెసర్ ఎటికాల పురుషోత్తం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన దుగ్యాల రామును శాలువాతో సత్కరించి, ఈ జీవితకాల సాఫల్య పురస్కారాన్ని అందజేశారు. విద్యా రంగంలో రాము అందించిన సేవలను, సహకారాన్ని శారదా ఎడ్యుకేషనల్ సొసైటీ కమిటీ ప్రతినిధులు కొనియాడారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి ప్రొఫెసర్ ఎటికాల పురుషోత్తం మాట్లాడుతూ, సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల, విద్యావేత్తల పాత్ర కీలకమైనదన్నారు. నిస్వార్థంగా విద్యాసేవ అందిస్తూ ఎంతో మంది విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసిన దుగ్యాల రాముకు ఈ జీవితకాల సాఫల్య పురస్కారం దక్కడం తగిన గుర్తింపు అని పేర్కొన్నారు. ఈ సేవలు రాబోయే తరాల ఉపాధ్యాయులకు స్ఫూర్తినిస్తాయని చెప్పారు. అవార్డు గ్రహీత దుగ్యాల రాము మాట్లాడుతూ, అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేళ తన సేవలను



గుర్తించి ఈ పురస్కారానికి ఎంపిక చేసినందుకు శారదా ఎడ్యుకేషనల్ సొసైటీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ గౌరవం తనపై బాధ్యతను మరింత పెంచిందని, విద్యా రంగ వృద్ధికి మరింత కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ వేడుకలో శారదా ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రతినిధులు, విద్యావేత్తలు, పలువురు మేధావులు పాల్గొని దుగ్యాల రాముకు శుభాకాంక్షలు తెలియజేశారు

# ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు

హైదరాబాద్, జ్యోతి ప్రభంజనం, అక్టోబర్ 12:తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకలు హైదరాబాద్‌లోని రామంతాపూర్ వెంకట సాయి నగర్ కాలనీలో ఘనంగా నిర్వహించారు. వెంకట సాయి నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంగిలిపూల బతుకమ్మ వేడుకల్లో కమిటీ సభ్యులు, కాలనీ మహిళలు ఉత్సాహంగా





పాల్గొన్నారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి, సంప్రదాయబద్ధంగా బతుకమ్మ పాటలు పాడుతూ సంబరాలు జరుపుకున్నారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ప్రతి ఒక్కరూ ఐకమత్యంతో జరుపుకోవడం ఆనందంగా ఉందని నిర్వాహకులు తెలిపారు. ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు కాలనీవాసుల మధ్య ఐక్యతను, సోదరభావాన్ని మరింత పెంపొందిస్తాయని పేర్కొన్నారు. కాలనీ సంక్షేమం కోసం కృషి చేస్తూనే, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించేందుకు తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలను కొనసాగిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

# మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించాలి

## నైపుణ్యాభివృద్ధితో స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించుకోవాలి



ఎల్ బీ నగర్, జ్యోతి ప్రభంజనం, అక్టోబర్, న2:జయచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చంపాపేట డివిజన్ యువ నాయకులు సంధ్య రవి ముదిరాజ్ అధ్యక్షతన చంపాపేట డివిజన్ పరిధిలోని మోడల్ మార్కెట్ బిల్డింగ్ ఆవరణలో గత కొన్ని రోజులుగా నిర్వహించిన ఉచిత కుట్టు శిక్షణ కోర్సులను విజయవంతంగా పూర్తి చేసిన మహిళా సోదరీమణులకు సర్టిఫికెట్లను ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ,ట్రస్ట్ చైర్మన్ కమల సుధీర్ రెడ్డి ల చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక మహిళ చేతిలో నైపుణ్యం ఉంటే ఒక కుటుంబం ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతుందని, ఒక కుటుంబం ఎదిగితే సమాజం అభివృద్ధి పథంలో నడుస్తుందని అన్నారు. మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించి, స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించుకోవాలనే లక్ష్యంతో జయచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ శిక్షణలో ప్రాథమిక స్థాయి నుంచి ఆధునిక కుట్టు నైపుణ్యాలతో పాటు బ్యూటీషియన్, మెహందీ వంటి ఉపాధి అవకాశాలకు ఉపయోగపడే కోర్సుల్లో సమగ్ర శిక్షణ అందిస్తున్నట్లు వెల్లడించారు. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన మహిళలు ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయడంతో పాటు, తమ కుటుంబ ఆర్థిక అభివృద్ధికి బలమైన పునాది వేసుకునే అవకాశం పొందుతారని అన్నారు. మహిళల నైపుణ్యాభివృద్ధి, ఆర్థిక స్వావలంబన కోసం జయచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ భవిష్యత్తులోనూ మరిన్ని కార్యక్రమాలను నిర్వహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రమాదేవి,ఉష, ప్యారి,కవిత,లావణ్య,స్వయం ప్రభు మరియు ట్రస్ట్



ప్రతినిధులు,బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు,శిక్షణ పొందిన మహిళలు,స్థానిక మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# నిఘా వ్యవస్థను మరింత బలోపేతం

## - భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు

## - కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ప్రారంభం

భద్రాద్రి కొత్తగూడెం(జ్యోతి ప్రభంజనం):జిల్లాలో నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ను ఏర్పాటు చేసినట్లుగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తెలిపారు. సోమవారం ఆయన చుంచుపల్లి పోలీస్ స్టేషన్‌ను సందర్శించి నూతనంగా ఏర్పాటు చేసిన జిల్లా కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ నేరాల నియంత్రణ నేరాల గుర్తింపు దర్యాప్తును మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఇందులో భాగంగా జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ సీసీటీవీ కెమెరాలు, పోలీస్ స్టేషన్లలోని కెమెరాలను కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం మొత్తం 467 సీసీటీవీ కెమెరాలను ఈ కేంద్రానికి అనుసంధానం చేయడంతో జిల్లాలో నిఘా వ్యవస్థ మరింత బలోపేతమైందని పేర్కొన్నారు. ఈ వ్యవస్థ ద్వారా ఆయా ప్రాంతాల్లోని పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించడంతో పాటు అనుమానాస్పద కార్యకలాపాలను గుర్తించడం నేరాల నియంత్రణ అత్యవసర పరిస్థితుల్లో తక్షణమే స్పందించడం సులభతరం కానున్నదన్నారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని అవసరమైన ప్రాంతాల్లో మరిన్ని



సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి వాటిని కమాండ్ అండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేయాలని సంబంధిత అధికారులను ఎస్పీ ఆదేశించారు. ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని నేరాల నియంత్రణలో సీసీటీవీ నిఘా వ్యవస్థ కీలక పాత్ర పోషించేలా చర్యలు చేపట్టాలని ఎస్పీ సూచించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణలో భాగంగా పోలీసు అధికారులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణతో పాటు పోలీసు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరూ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలి

## బీజేపీ నాయకుల పిలుపు



జ్యోతి ప్రభంజనం, హైదరాబాద్, అక్టోబర్ 12:ఐఎస్ సదన్ డివిజన్, సరస్వతి నగర్ డివిజన్లలో సోమవారం ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జంగం మధుకర్ రెడ్డి, కౌన్సిల్ సభ్యులు అమర్‌నాథ్ రెడ్డి, ఐఎస్ సదన్ డివిజన్ అధ్యక్షులు సాయి సాగర్, సరస్వతి నగర్ డివిజన్ అధ్యక్షులు బాలు నాయక్‌తో పాటు పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరూ ఎమ్మెల్సీ ఓటరుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ఎంతో కీలకమని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరు నమోదుపై అవగాహన కలిగి ఉండాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవడం ద్వారా ప్రజాస్వామ్య బలోపేతానికి సహకరించాలని కోరారు.

printed and published by Rapolu Lingaswamy,onbehalf of printed at SMILYS ONLINE 6-7-48, Vanasthali Puram Shoping Complex, Dist:Rangareddy,stete:Telangana Editor: Rapolu Lingaswamy.pone:9908103501, PRGI NO:TGTEL/26/A6501 Email: rapolulingaswamy01@gmail.com